నిర్మించి వదిలేశారు



తక్షణం మార్కెటింగ్ శాఖ స్పందించాలి



గతంలో ప్రభుత్వాలు చేయలేని పని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు రైతు బజారు నిర్మించింది. చిన్నా చితకా సమస్యలు ఉంటే పూర్తి చేసి విక్రయాలు పూర్తి చేయవలసిన మార్కెటింగ్ విభాగం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. వెంటనే విక్రయాలు ప్రారంభించకపోతే నిర్మాణాలు పాడయ్యే ప్రమాదం ఉంది.

–పల్లా వెంకటరావు, మాజీ సర్పంచ్

చిట్టివలస రైతు బజార్‌కు అడుగడుగునా ఆటంకాలు

- ప్రారంభానికి నోచుకోని వైనం
- వినియోగదారులకు ఇబ్బందులు
- దోచుకుంటున్న ప్రైవేటు వ్యాపారులు

15 నెలలుగా మార్కెటింగ్ శాఖ కొర్రీలు

తగరపువలస: చిట్టివలస రైతు బజారుకు మూడు దశాబ్దాలుగా అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. స్థానికంగా రైతు బజారు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడి ప్రైవేట్ మార్కెట్‌లో రైతులు అమ్మినవే కూరలు, చెప్పిందే ధర అన్నట్టుగా సాగుతోంది. దీంతో ఈ ప్రైవేట్ మార్కెట్‌లో ప్రియమైన కూరగాయలు, ఆకుకూరలు కొనలేక, అలాగే అవసరమైన కూరలు అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రాంత వినియోగదారులు ఆనందపురం హోల్‌సేల్ మార్కెట్, విశాఖ, విజయనగరంలోని రైతు బజారులు, నగరంలోని జ్ఞానాపురం, పూర్ణామార్కెట్‌లకు వెళ్లి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు చవక ధరలకు కొనుగోలు చేస్తుంటారు. 30 ఏళ్లుగా తగరపువలసలో రైతు బజారు నిర్మిస్తామని హామీలు ఇచ్చుకుంటూ వచ్చిన టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ హామీని నిలబెట్టుకోలేకపోయాయి. ప్రస్తుతం మెయిన్ రోడ్డును ఆనుకుని **నిర్వహిస్తున్న ప్రైవేట్ మార్కెట్ కారణంగా నిత్యం ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం** ఏర్పడుతూనే ఉంది. దీంతో ఈ ప్రాంతంలో రైతు బజారు ఆవశ్యకతను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిట్టివలసలో రూ. 78 లక్షలతో రైతు బజారు నిర్మించి కూర గాయలు, ఆకు కూరల విక్రయాలకు స్టాళ్లు, కిరాణా వస్తువులకు దుకాణాలు నిర్మించారు. అంతేకాకుండా వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రహరీని ఆధునీకరించారు. 2024 ఫిబ్రవరిలో రైతు బజారును ప్రారంభించారు.



ఆవరణలో టైల్స్, పచ్చదనం పరుచుకున్న రైతుబజారు



విక్రయాలకు నోచుకోని చిట్టివలస రైతు బజారు



మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్‌కు ఆటంకంగా ప్రయివేట్ మార్కెట్

అన్ని వసతులతో రైతు బజారు నిర్మించినా, మార్కెటింగ్ శాఖ మాత్రం 15 నెలలుగా కొర్రీలు వేస్తూ విక్రయాలు ప్రారంభించకుండా వాయిదాలు వేస్తోంది. గత ఏడాది సాధారణ ఎన్నికలు ముగిసిన తరువాత రైతు బజారు నిర్మాణానికి బిల్లులు రాలేదని, రైతులను ఎంపిక చేయలేదని, ఆవరణలో టైల్స్, పచ్చదనం పనులు పూర్తి కాలేదని వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తోంది. ప్రస్తుతం పనులు పూర్తయి రాత్రివేళ ఈ రైతు బజారును ఆకతాయిలు అడ్డాగా చేసుకోవడమే కాకుండా, పూర్తయిన నిర్మాణాలకు నష్టం కలిగిస్తున్నారు. బజారులో నిర్మించిన దుకాణాలను మార్కెటింగ్ శాఖ సిబ్బంది అనధికారికంగా కొందరు వ్యాపారులకు స్టోర్ రూమ్‌లుగా అద్దెకు ఇచ్చేశారు. రూ. 78 లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు బజారులో విక్రయాలు ప్రారంభించకుండా మార్కెటింగ్ శాఖ ప్రత్యక్షంగా ప్రైవేట్ మార్కెట్ యాజమాన్యానికి సహకరిస్తూ, పరోక్షంగా మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రైవేట్ మార్కెట్‌లో ధరలు దారుణం



ప్రైవేట్ మార్కెట్‌లో రైతులు అమ్మేందుకు వ్యాపారులు ఒప్పుకోవడం లేదు. దీంతో వాళ్లు మెయిన్‌రోడ్డును ఆక్రమించి ఏదో ధరకు విక్రయించి వెళ్లిపోతుంటారు. తరువాత మార్కెట్‌లో రిటైల్ వ్యాపారులు నచ్చిన ధరలకు విక్రయిస్తారు. రైతు బజారులో విక్రయాలు ప్రారంభించే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుంది. **–దెక్కతి శివారెడ్డి, వలందపేట**

విక్రయాలతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



రైతు బజారులో విక్రయాలు ప్రారంభించిన రోజే తగరపువలసలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఈ ప్రాంత ప్రజల కల నెరవేరి అతి తక్కువ ధరలకు నాణ్యమైన తాజా ఆకుకూరలు, కూరగాయలు లభిస్తాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతు బజార్‌ను ప్రారంభించారు. **–చింతగుంట శివ, చిట్టివలస**



ఏడాది క్రితమే సిద్ధమైన దుకాణాలు

క్లుప్తంగా

పౌష్టికాహారం..మహాబలం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు వాడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ జయదేవి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. ఎప్పటికప్పుడు పౌష్టికాహారం తీసుకోవాలని, అది వారికి మహాబలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, పీవో శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ కోర్సుపై అవగాహన



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా గురువారం ఎలక్ట్రికల్ కోర్సుపై అవగాహన కార్యక్రమం జరిగింది. 9, 10, ఇంటర్ విద్యార్థులకు భీమిలి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ సరఫరా ఎలా జరుగుతుంది..అనే విషయాలపై అవగాహన కల్పించారు. దీని గురించి ప్రిన్సిపాల్ గంగా కుమారి మాట్లాడుతూ ఇటువంటి కోర్సుల ద్వారా విద్యార్థినులకు నైపుణ్యాలు వస్తాయని, ఇది వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్రి యశోద, కుసుమ కిరణ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న పార్టీ కన్వీనర్ రామానాయుడు

భీమునిపట్నం: నియోజకవర్గ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అన్నారు. గురువారం భీమిలిలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మేలు చేసే కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసుపల్లి శ్రీహరి, ప్రసాదరావు పట్నాయక్, పసుపులేని శ్రీనివాసరావు, కంటుభుక్త సునీత పాల్గొన్నారు.

రెండు చోట్ల చలివేంద్రాలు

మధురవాడ: ఎండలు మండిపోతున్న తరుణంలో విజ్డిస్ పౌండేషన్ నిర్వాహకులు తలశిల విజయోహన్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మధురవాడలో త్రిశక్తి ఆలయం, గాయిత్రి కాలేజీ రోడ్డులలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కొమ్మాది జంక్షన్ త్రిశక్తి ఆలయం వద్ద దాహార్తులకు మజ్జిగ పంపిణీ చేసి విజయమోహన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 3 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎండలు పూర్తిగా తగ్గేవరకూ కొనసాగిస్తామని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు రఘురాం

భీమునిపట్నం: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ దగ్గర ఉప్పల్ నవశక్తి నగర్‌కు చెందిన ఎస్.రఘురాం (52) బుధవారం భీమిలికి వచ్చాడు. ఇక్కడ బీచ్ ప్రాంతంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇక్కడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇక్కడకు వచ్చి ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డాడు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్లు నరికితే వాల్టా చట్టం ప్రకారం చర్యలు



సాక్షిలో ప్రచురితం అయిన వృక్ష విలాపం కథనం



చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలస్తున్న ఉద్యానవన శాఖాధికారి అర్చన

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: అనుమతి లేకుండా చెట్లు కొట్టినా, కొమ్మలు నరికినా ఓల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోన్–2 ఉద్యాన శాఖాధికారి పల్లా అర్చన చెప్పారు. మధురవాడలో పరదేశిపాలెం హైవే, మధురవాడ జోనల్ కార్యాలయం, అయోధ్యనగర్, మిథిలాపురి వుడా కాలనీ, శివశక్తినగర్ పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా కొంతమంది ఇష్టానుసారంగా చెట్లు నరికేసి పచ్చదనాన్ని హరించేస్తున్న వ్యవహారంపై గురువారం 'వృక్ష విలాపం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి ఆమె స్పందించారు. మధురవాడ, పరదేశిపాలెంలలో పర్యటించి, నరికివేతకు గురైన చెట్లను పరిశీలించి బాధ్యులను విచారించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెనాల్టీలు వసూలు చేయడంతో పాటు కేసులు కూడా పెడతామన్నారు. బాధ్యులకు నోటీసులు జారీ చేసి పెనాల్టీలు వసూలు చేస్తామని చెప్పారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ఆమె వెంట ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ గోవింద్ ఉన్నారు.

కాలువల పూడ్చివేతను పరిశీలించిన అధికారులు



మానం ఆంజనేయులు కాలనీలో మూసివేసిన కాలువలకు ఫొటోలు తీస్తున్న సెక్రటరీలు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు ఐటీ సెజ్ జంక్షన్ సమీపంలోని మానం ఆంజనేయులు కాలనీలో మురుగు నీరు పారే కాలువలను ఓ వ్యక్తి 5 చోట్ల పూడ్చివేసిన ఘటనపై వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ సెక్రటరీ చైతన్య, జీవీఎంసీ ప్లానింగ్ సెక్రటరీ లోకేష్‌లు గురువారం పరిశీలించారు. కొద్ది నెలల క్రితం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 126/4లో ఉన్న వుడా ఈడబ్ల్యూఎస్ లే అవుట్ ప్రకారం ఏర్పాటు చేసిన రోడ్లను ఆనుకుని ఉన్న కాలువాను ఓ వ్యక్తి పూడ్చివేశాడు. దీంతో మురుగు నీరు నిలిచిపోయి ఈగలు, దోమలు, దుర్గంధంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో కాలనీ వాసులు కలెక్టర్, వీఎంఆర్‌డీఏ ఉన్నతాధికారులకు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో ఆప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోజురోజుకీ జఠిలమవుతున్న పారిశుధ్యం, ప్రజారోగ్య సమస్యలను కాలనీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, కార్యవర్గ సభ్యులు ప్రతాపరాజు, సీహెచ్‌వై నాయుడు, జేడీ నాయుడు తదితరులు వివరించారు. ఇక్కడి పరిస్థితులు గమనించి ఫొటోలు తీసుకుని వాస్తవ పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని సెక్రటరీలు చెప్పారు.

గోస్తనీనది కలుషితం



గోస్తనీనది వద్ద ఖాళీ కెమికల్ బాటిళ్లు



గోస్తనీనది వద్ద వ్యర్థాల మధ్య పంది

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ వద్ద గోస్తనీ నదిలో పందుల పెంపకందారుడు విషం చిమ్ముతున్నాడు. సంగివలస–పాండ్రంగి రహదారిలో నదిని ఆనుకుని పందుల పెంపకం చేపట్టిన వ్యక్తి పంచాయతీ, మండల పరిషత్ సిబ్బందికి ముడుపులు ముట్టజెప్పి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో అడ్డూ అదుపు లేకుండా పోయింది. హోటళ్ల నుంచి తీసుకువచ్చిన వ్యర్థాలు పందులు తినగా మిగిలినది నదిలో కలిపేస్తున్నాడు. పందులు దొర్లడానికి తీసుకువచ్చిన చెత్తాచెదారంలో మద్యం బాటిళ్లు, పెద్ద ఎత్తున ఖాళీ కెమికల్ సీసాలు నదిలో కలిపేస్తున్నాడు. అంతేకాకుండా పందుల మలమూత్రాలతో కలిసిన పెంటను కూడా నదిలో వేస్తున్నారు. దీంతో ఇక్కడి నదీజలాలు విషతుల్యంగా మారే ప్రమాదం ఉందని తాటితూరు, టి.నగరపాలెం పంచాయతీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నదిని ఆనుకుని పందుల శాల

విశాఖ, విజయనగరం జిల్లాలకు ఇక్కడి వనరులే..

వాస్తవానికి గోస్తనీ నదిలో ఈ ప్రాంతం నుంచి విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన పలు మండలాలకు, జీవీఎంసీ భీమిలి జోన్, దివీస్, విజయనగరం మున్సిపాలిటీలకు తాగునీటి వనరులు ఇక్కడి నుంచే తరలిస్తారు. దీనికి గాను ఈ ప్రాంతంలో పలుచోట్ల ఊటబావులు ఉన్నాయి. పందుల పెంపకందారుడు నదిలో చెత్తతో కలిసిన వ్యర్థాలతో పాటు ఖాళీ కెమికల్ బాటిళ్లు కలిపేస్తుండటంతో నీళ్లు విషంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ, మండల శాఖ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నదీతీరంలో ప్రమాదకరమైన వ్యర్థాలతో పాటు పందుల పెంపకాన్ని తొలగించాలని టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీ వాసులు కోరుతున్నారు.

జూన్ 8న ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటు



ప్రతిష్ట ముహూర్తం కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు

భీమునిపట్నం: భీమిలిలోని పురాతన భీమేశ్వర ఆలయం వద్ద కొత్తగా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయడానికి సంబంధించిన ప్రతిష్టా ముహూర్తం కార్యక్రమం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. శివకేశవుల ఆలయ ప్రాంగణంలో ఉండే ఈ ఆలయ ధ్వజస్తంభం పూర్తిగా శిథిలమైంది. దీనిపై స్పందించిన దాతలు గుగ్గిళ్ల గురునాథ గుప్తా, ఆయన కుటుంబ సభ్యులు రామకృష్ణ, గుగ్గిళ్ల శాస్త్రి ధ్వజస్తంభం ఏర్పాటుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆలయ ట్రస్టీ రొంపిచర్ల సింగరాచార్యులు, ఆలయ వంశపారంపర్య అర్చకులు ఏడిద శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ముహూర్తాన్ని ఖరారు చేశారు. దాని ప్రకారం వచ్చే జూన్ నెల 8వ తేదీన నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ సింగరాచార్యులు మాట్లాడుతూ ఎంతో పురాతన, చరిత్ర కలిగిన ఈ ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటుకు దాతలు ముందు రావడం మంచి విషయమని అన్నారు. అలాగే ధ్వజస్తంభం ఏర్పాటు ఎంతో వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఇందులో హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలిపల్లి షణ్ముఖరావు, భీమిలి ప్రెస్ క్లబ్ కార్యదర్శి అడిదం కిశోర్, భక్తులు కంచర్ల కామేష్, బాల మాస్టర్, రాకోతు సింగులు, తెరుపల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు పసుపు, కుంకుమల సమర్పణ



సారెతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేట, జీరుపేట గ్రామస్తులు గురువారం ఎల్లమ్మవారికి పసుపు, కుంకుమలు, సారె సమర్పించారు. బాణసంచా, తీన్‌మార్‌లు వెంటారాగా మహిళలు కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య వంతమైన సమాజం



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరిస్తున్న సిబ్బంది

పద్మనాభం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆరగిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించవచ్చని మండల థీమాటిక్ లీడ్ ఎం.గణేష్ కుమార్ అన్నారు. మండలంలోని అనంతవరంలో గురువారం ప్రకృతి వ్యవసాయం సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాలను సాగు చేస్తే భూమి సారవంతమై ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వాతావరణ కాలుష్యం ఉండదన్నారు. టమాటాకు సోకిన తెగుళ్లను నివారించడానికి పురుగుల మందులను ఎక్కువగా పిచికారీ చేస్తున్నారు. ఈ టమాటాలను తినడం వల్ల పెద్దలతో పాటు పిల్లల ఆరోగ్యం దెబ్బ తింటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులు కొయ్యల వెంకటరావు, జగ్గమ్మలను దుశ్శాలువతో సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమునిపట్నం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జి.పెద ఎర్రినాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, దుర్గారావు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప సన్నిధిలో ఆరాట్టు ఉత్సవం

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణపుష్కల సమేత ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆరాట్టు ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శబరిమల ఉత్సవం తరహాలో ఇక్కడ కూడా జరుగుతుందన్నారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, గణపతి హోమం అనంతరం నవద్రవ్య అభిషేకాలు చేస్తామన్నారు.

నేటి నుంచి దత్తాత్రేయ విగ్రహా ప్రతిష్టాపనా మహోత్సవాలు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి పీఠం ప్రాంగణంలో శుక్రవారం నుంచి రెండు రోజులు పాటు దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట హోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఏ. నరసింహమూర్తి చెప్పారు. సాయంత్రం గణపతి పూజ, అఖండ దీపారాధన, రక్షాబంధన, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. శనివారం సకల దేవతాహోమం, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి, వేదాశీర్వచనం, పండిత సత్కారం వంటి వాటితో కార్యక్రమాలు పూర్తవుతాయన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌కు దివీస్ చేయూత



విలేజ్ క్లినిక్‌కు దివీస్ అందించిన ఫర్నిచర్

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీకి చెందిన విలేజ్ హెల్త్ క్లినిక్‌కు గురువారం దివీస్ లేబొరేటరీ రూ.90 వేల విలువైన ఫర్నిచర్‌ను అందించింది. అలాగే రూ.2.30 లక్షల వ్యయంతో సేఫ్టీ గ్రిల్స్, సీసీ రోడ్ల సౌకర్యం కల్పించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, వైద్యురాలు శోభారాణి, సర్పంచ్ వెంపాడ రమావతి, చుక్క శివాజీ, అప్పారావు, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉక్కిరిబిక్కిరి



పాఠశాల ప్రాంగణంలో వ్యాపించిన పొగ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇక్కడ పాఠశాలను సందర్శించడానికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రానున్నారనే విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, పాఠశాల ప్రాంగణంలో ఉన్న వ్యర్థాలను సిబ్బందితో తొలగించి పాఠశాల సమీపంలో మంట పెట్టారు. దీంతో ఒక్కసారిగా పాఠశాల చుట్టూ పొగ కమ్మేయడంతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. పాఠశాలలో విద్యార్థులు లేని సమయంలో చేయాల్సిన పనిని అందరూ ఉండే సమయంలో ఎలా చేస్తారంటూ తల్లిదండ్రులు అసహనానికి గురయ్యారు. ఈ పొగతో సుమారు గంట పాటు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తల్లిదండ్రుల కష్టాలను గుర్తెరగాలి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

తగరపువలస: విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను గుర్తెరగాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో 'నవసమాజ నిర్మాణం'పై ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆత్మహత్యలు, డ్రగ్స్, సైబర్ నేరాలు, సాంకేతిక సమస్యల నుంచి తప్పించుకోవడంపై వివరించారు. కష్టాల్లో ఉంటే 7995095799 నంబరులో వాట్సాప్ ద్వారా సంప్రదించాలని, సైబర్ నేరాల కోసం 1930, డ్రగ్స్ సమాచారం కోసం 1972 టోల్ ఫ్రీ నంబర్లకు తెలియజేయాలని సూచించారు. స్నేహితుల సలహాతో సమస్యల నుంచి బయటపడవచ్చని, మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలు జరుగుతాయని తెలిపారు. సైబర్ నేరాల ద్వారా మన డబ్బు విదేశాలకు తరలిపోతోందని, రానున్న సంవత్సరంలో రూ.1.20 లక్షల కోట్లు తరలిపోయే అవకాశం ఉందని అంచనా వేశారన్నారు. లోన్ యాప్‌లు, నగదు బదిలీ, ట్రాయ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ ఎస్.అప్పలరాజు, సీఐ బి.తిరుమలరావు, ఎస్ఐ గంటా హరీష్, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తోబుట్టువుల దినోత్సవం



విద్యార్థులకు తోబుట్టువుల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట పాఠశాలలో గురువారం తోబుట్టువుల దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ అక్క, అన్నయ్య, చెల్లెలు, తమ్ముడుల ప్రాధాన్యత గురించి తెలియజేశారు.